సాక్షి
అనంతపురం
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



నేటి నుంచే సెలవులు

1 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు దసరా పండుగ సెలవులు ఒకరోజు ముందే వదిలారు. మంగళవారం సాయంత్రానికే పాఠశాలలు మూతపడ్డాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.6°/22.3°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణ స్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రానున్న 5 రోజుల్లో తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 34.0–38.2, రాత్రి ఉష్ణోగ్రతలు 21.8–24.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 70–82 శాతం, మధ్యాహ్నం 42–78 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. 9 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 68,మినీ అంగన్ వాడీ టీచర్ పోస్టులు 4 ఉండగా 11, అంగన్ వాడీ హెల్పర్ పోస్టులు 71 ఉండగా 224 దరఖాస్తులు వచ్చినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. శిశుగృహలో ఖాళీగా ఉన్న 7 పోస్టులకు 85 దరఖాస్తులు అందినట్లు వివరించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



అనంతపురం క్రైం: దసరా సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక, తెలంగాణ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రద్దీకనుగుణంగా 210 బస్సులు సిద్ధం చేశామన్నారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ దాకా 110 బస్సులు నడుస్తాయన్నారు. తిరుగు ప్రయాణం చేసే వారి కోసం ఈ నెల 13 నుంచి 16 దాకా 100 బస్సులు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి 80, బెంగళూరు నుంచి 89, విజయవాడ నుంచి 13 బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఇతర సమీప జిల్లాల నుంచి రద్దీకనుగుణంగా 32 బస్సులను సిద్ధంగా ఉంచుకున్నట్లు తెలిపారు. బెంగళూరు, విజయవాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, హైదరాబాదు, చెన్నై నగరాలకు రద్దీని బట్టి బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయని, రాకపోకలకు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు.

పత్తి కొనుగోలుకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

అనంతపురం అర్బన్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. నాణ్యతను బట్టి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చొప్పున చెల్లించాలని సూచించారు. పత్తి కొనుగోలు అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, వ్యవసాయ శాఖ ఏఓ బాలనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సీసీఐకు పత్తి అమ్మదలిచిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం 1వ, 2వ పేజీ జిరాక్స్ కాపీలు ఇవ్వాలన్నారు. ఒకవేళ రైతు కుటుంబ సభ్యులు పత్తిని విక్రయానికి తీసుకొస్తే రేషన్ కార్డు జిరాక్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే పత్తి విక్రయాలకు సంబంధించి రైతులు ముందుగా ఆర్‌ఎస్‌కేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పత్తి తేమ లేకుండా బాగా ఆరబెట్టి తీసుకురావాలన్నారు. తాడిపత్రి (91823 61482), గుత్తి (91823 61475) మార్కెట్ యార్డు పరిధిలోని కార్యదర్శులను సంప్రదించిన తర్వాతనే పత్తి దిగుబడులను మార్కెట్‌కు తరలించాలని సూచించారు.

ఇసుక నిల్



జుంజురాంపల్లి వద్ద కుప్పచేసిన నాణ్యత లేని ఇసుక

- జుంజురాంపల్లి స్టాక్‌యార్డులో ఖాళీ
- నేలను గోకి కుప్పచేయడంతో ఉన్న ఇసుకలో అధిక భాగం మట్టి మిక్స్
- తరలించేందుకు ఆసక్తి చూపని నిర్మాణదారులు
- ఇసుక కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, తాపీమేస్త్రీలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



రాత్రి వేళ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

రాయదుర్గం: జిల్లాలోని రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలో ఏర్పాటు చేసిన స్టాక్‌యార్డులో ఇసుక ఖాళీ అయ్యింది. ప్రస్తుతం అరకొరగా ఉండే ఇసుకను జేసీబీలతో అధికారులు కుప్ప చేయించడంతో ఎక్కువ శాతం మట్టి కలిసింది. దీంతో భవన నిర్మాణదారులు ఆ ఇసుకపై ఆసక్తి చూపడం లేదు. దీంతో 510 మెట్రిక్ టన్నుల ఇసుక ప్రభుత్వ రికార్డుల్లో మిగిలిపోయింది.


20 రోజులుగా దుస్థితి

విక్రయాలు ప్రారంభించే నాటికి స్టాకు యార్డులో 58,160 మెట్రిక్ టన్నుల ఇసుక ఉండేది.మైనింగ్ అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటికే 57,650 మెట్రిక్ టన్నులు విక్రయించారు. ప్రస్తుతం ఉన్న మట్టి కలిసిన ఇసుక పూర్తిగా అయిపోతే గానీ, కొత్తగా ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఇసుక కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న తాపీ మేస్త్రీలకు పనుల్లేకుండా పోతున్నాయి. 20 రోజులుగా దుస్థితి నెలకొన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కణేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద స్టాక్‌యార్డు ఉన్నా అందుబాటులోకి తీసుకురాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత ఏర్పడింది.

అక్రమార్కులకు కాసులు..

స్టాక్‌యార్డు నుంచి ఇసుక రవాణాకు బ్రేక్ పడడంతో ఇదే అదనుగా జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. ఇప్పటికే అక్రమ మార్గంలో ఇసుక కొల్లగొడుతున్న వారు.. ఇటీవల మరింత విచ్చలవిడిగా తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు రాయదుర్గం నియోజకవర్గంలోని గుండ్లపల్లి, భూపసముద్రం తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్టాక్ యార్డు ఉన్నప్పుడైతే ట్రాక్టర్ ఇసుక రాయదుర్గం పట్టణంలో రూ.2 వేలకే లభించేది. ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.5 వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇలా ఒక వైపు అక్రమార్కులకు కాసులు కురుస్తుంటే, మరోవైపు సాధారణ ప్రజలు, భవన నిర్మాణదారులకు మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి ఇసుక కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

పనులు దొరకడం లేదు



ఇసుక లేక నిర్మాణాలు మందగించాయి. దీంతో కూలి పనులు దొరకడం లేదు. నిత్యం మేస్త్రీల వద్దకెళ్లి కాసేపు కాలం గడిపి ఇంటికెళ్లిపోతున్నాం. 10 రోజుల్లో దసరా పండుగ వస్తోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి ఇసుక కొరత తీర్చాలి.

– రామాంజినేయులు, కోట ఏరియా, రాయదుర్గం

పస్తులుండాల్సి వస్తోంది



గత 20 రోజుల నుంచి ఇసుక కొరత ఎక్కువైంది. ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. తాపీ మేస్త్రీలు, కూలీలు పనుల్లేక పస్తులుండాల్సి వస్తోంది. జుంజురాంపల్లి స్టాక్‌యార్డులో ఇసుక నిల్వ ఉన్నంత వరకు రూ.2 వేల నుంచి రూ.2,200కు టన్ను లభించింది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుకకు రూ.4,500 నుంచి రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణదారులు ముందుకు రావడం లేదు. ఉచితం కాస్తా ప్రచారానికే పరిమితమైంది. కణేకల్లు మండలంలో ఉన్న ఇసుక స్టాక్ యార్డును ప్రారంభిస్తే అవస్థలు తప్పే అవకాశం ఉంది. ఇసుక ఇక్కట్లు ఇలాగే కొనసాగితే మేస్త్రీలు, కూలీలు పండుగ పూట కడుపు మాడ్చుకోవాల్సిందే!.

– వన్నూరప్ప, తాపీ మేస్త్రీ, రాయదుర్గం

కష్టాలు తీర్చాలి



జుంజురాంపల్లి స్టాక్‌యార్డులో ఉండే అరకొర ఇసుక మట్టితో నిండిపోయింది. భవననిర్మాణాలకు దాన్ని అనుమతించడం లేదు. దీంతో 20 రోజుల నుంచి ఇసుక కొరత వెంటాడుతోంది. రూ.4,500 నుంచి రూ.5 వేలు వెచ్చించి కొనాలంటే నిర్మాణదారులు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వలస వెళ్లాల్సి వస్తుంది. నాతో పాటు పనిచేసే మేస్త్రీలు, కూలీలు నిత్యం ఇళ్లవద్దే కాలక్షేపం చేయాల్సిన దుస్థితి పట్టింది.

– ధర్మేంద్ర, మేస్త్రీ, రాయదుర్గం

త్వరలో కొత్తపాలసీ

జుంజురాంపల్లి స్టాక్‌యార్డులో 510 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. అది ఖాళీ కాలేదు. మట్టి కలవడంతో కొనుగోలుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కొత్తగా కణేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద స్టాక్‌యార్డు తెరిచేలా కృషి చేస్తున్నాం. వచ్చే నెల 15 లేదా 16వ తేదీల్లో ఇసుకపై కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రజలు, తాపీ మేస్త్రీలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఇసుక అందించేలా చర్యలు చేపడతాం.

– వెంకటేశులు, మైనింగ్ డీడీ, అనంతపురం

సమన్వయంతో పని చేయండి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం




మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యల్లనూరు: మండలస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రగతి లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. యల్లనూరు మండలంలో కలెక్టరు మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. యల్లనూరు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు పంపిణీ చేశారు. వాసాపురం గ్రామంలో రైతు శివప్రసాదు పొలంలో ఫారంపాండ్ పనులను ప్రారంభించారు. బొప్పేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నారు. 'పొలం పిలుస్తోంది' విస్తృతంగా నిర్వహించాలన్నారు. రైతులకు టేకు మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని సూచించారు. ఈ నెల 3న గురువారం ఆల్ ఇండియా రేడియో ద్వారా ఉదయం 7.45 గంటల నుంచి 8.15 గంటల వరకు ఫోన్ ఇన్ కార్యక్రమంలో అధికారులు పాల్గొనాలన్నారు. ఉద్యాన పంటల సాగులో రైతులకు ఎలాంటి సాయం కావాలనే విషయంపై చర్చిస్తామని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తిమ్మంపల్లిలో ఉద్యాన వనాన్ని పరిశీలించి పనులు బాగున్నాయని ఉపాధి అధికారులు, సిబ్బందిని అభినందించారు. రైతు మల్లికార్జున నాయుడు దానిమ్మ పొలంలో డ్రోన్ ద్వారా మందులను చల్లడాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి ఉమా మహేశ్వరమ్మ, మండల ప్రత్యేకాధికారి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, తాడిపత్రి ఏపీడీ వెంకటరత్నం, ఏడీఏ చెంగల్‌రాయుడు, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మల్లీశ్వరి, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ వీరరాజు, ఏఓ రామకృష్ణ, ఏపీఓ షబ్బీర్‌బాషా, పీఆర్ జేఈ నరేంద్ర, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఈసీ బబ్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల కష్టాలు పట్టవా..?

- ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట తుడిచి పెట్టుకుపోయింది
- రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలి
- 'అన్నదాత సుఖీభవ' కింద రూ.20 వేలు వెంటనే మంజూరు చేయాలి
- సబ్సిడీతో వేరుశనగ, పప్పుశనగ విత్తనాలు అందించాలి
- ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఈ విషయంపై దృష్టి సారించాలి
- ఆత్మహత్యలు, వలసలు జరగకముందే ఆదుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి



12 వేల విద్యుత్ కనెక్షన్ల పెండింగ్..

జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెరుగుతున్నా భూగర్భ జలాలు మాత్రం అడుగంటే పరిస్థితి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో 12 వేల విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, 4 వేల ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఉందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి నుంచి కనెక్షన్లు ఇవ్వలేదని, ప్రజాప్రతినిధులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలన్నారు.

అనంతపురం కార్పొరేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల కష్టాలు కూటమి సర్కారుకు పట్టడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ మాసంలో వర్షాలు రావడంతో పెద్ద ఎత్తున రైతులు పంట సాగు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుశనగ 4.50 లక్షల ఎకరాలతో పాటు కంది, కొర్ర, మొక్కజొన్న, జొన్న ఇతర పంటలు సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చాయన్నారు. అయితే, జూలై నుంచి ఆగస్టు చివరి వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. వేరుశనగ పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. రైతులు ఎకరా వేరుశనగ సాగుకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారని, సుమారు రూ.1,600 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకు పెట్టుబడి ఖర్చు అయ్యిందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసిందని, దిగుబడి లేని పరిస్థితుల్లో ఎక్కడ చూసినా పంటను తొలగిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంటే ప్రభుత్వం మాత్రం ఆదుకునే పరిస్థితి కన్పించడం లేదన్నారు. గత ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తూ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో ఖరీఫ్ మొదలవగానే పెట్టుబడి సాయంగా రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి..

జిల్లాలో కరువు పరిస్థితుల గురించి సీఎం చంద్రబాబుకు తెలియంది కాదన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఇక్కడి రైతుల పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తామన్న రూ.20 వేలు తక్షణం ఇవ్వాలన్నారు. పంట నష్టపోయిన వేరుశనగ రైతులకు ఎకరాకు రూ.30,000 అందించాలని డిమాండ్ చేశారు. రబీ ప్రారంభమైన నేపథ్యంలో వేరుశనగ విత్తనం కూడా 50 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పప్పుశనగ విత్తనం 40 శాతం రాయితీతో అందించిందని, కానీ కూటమి ప్రభుత్వం ఆ రాయితీని 25 శాతానికి కుదించడం సరికాదన్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు దెబ్బతిన్నాయని, ఈ ఏడాది కూడా అవే దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కరువును దృష్టిలో ఉంచుకుని 50 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందించాలన్నారు. నల్లరేగడి భూముల్లో వేరుశనగ వేసే అవకాశం ఉన్న నేపథ్యంలో 50 శాతం సబ్సిడీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత ఖరీఫ్‌కు సంబంధించి పంటల బీమా అందించాలన్నారు.ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల బీమా ప్రీమియం చెల్లింపుపై స్పష్టత లేదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

4 టీఎంసీలకు లెక్కే లేదా?

శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరున్నా తగిన రీతిలో తెచ్చుకోలేకపోతున్నామని అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శ్రీశైలం ద్వారా జూలై నుంచి నీరు తీసుకునే అవకాశం ఉన్నా ఆగస్టు నుంచి తీసుకుంటున్నామన్నారు. 2,200 క్యూసెక్కులు రావాల్సి ఉన్నా 1,300 క్యూసెక్కులు మాత్రమే వచ్చాయని తెలిపారు. రెండ్రోజుల నుంచి 1,600 నుంచి 1,700 క్యూసెక్కులు మాత్రమే మల్యాల నుంచి పంపింగ్ చేస్తున్నారన్నారు. ఎంపీఆర్, పీఏబీఆర్, హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీలో వాడుకునే నీరు జూలై నుంచే వస్తున్నాయన్నారు. 10.5 టీఎంసీలు వచ్చాయని అంటున్నా కేవలం 6.5 టీఎంసీలకే అధికారులు లెక్కలు చెబుతున్నారన్నారు. మిగిలిన 4 టీఎంసీల నీరు ఎక్కడ వాడుకున్నారని ఆయన ప్రశ్నించారు. కరువు జిల్లాలో ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి, సాగు,తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పింఛన్లు తొలగించేందుకు పన్నాగం



పామిడిలో పింఛన్‌దారులను ఒకే చోటకు పిలిచి డబ్బు అందిస్తున్న దృశ్యం



రాచానపల్లి పంచాయతీ ఆర్‌ఎన్‌ఆర్ కాలనీలో నాగలకట్ట వద్ద పింఛన్ల పంపిణీ..

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వం తన కుటిల బుద్ధిని చూపుతోంది. నెల వారీగా పింఛన్ల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు పావులు కదుపుతోంది. కుంటి సాకులు చూపించి చాలా మందికి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. వివరణ ఇచ్చిన అనంతరం అన్నీ సరిగా ఉంటే పింఛన్ ఇస్తామంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. యాడికి మండలంలోని వెంగన్నపల్లె గ్రామంలో 15 మంది పింఛన్లను రాజకీయ కక్షతో తొలగించారు. వీరంతా వృద్ధులు, దివ్యాంగులు కావడం గమనార్హం. గతంలో అన్ని విధాల పరిశీలించి అర్హులని నిర్ధారించుకున్నాకే పింఛన్లు మంజూరు చేశారని, నేడు ఇలా చేయడం ఏంటని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరివీ తొలగించలేదు

జిల్లాలో 2,83,487 మంది ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు అందుకుంటున్నారు. నెలవారీ పింఛన్ సొమ్ము రూ.12,43,97,400 పంపిణీ చేస్తున్నాం. ఇప్పటి దాకా 2,77,456 మందికి రూ.12,17,08,650 చెల్లించాం. జిల్లాలో ఇప్పటి దాకా ఒక్క పింఛన్ కూడా తొలగించలేదు. అనర్హులకు ఇస్తున్నారని ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయి. అడ్డదారుల్లో పింఛన్ పొందుతున్నట్లు ఫిర్యాదు చేశారు. చనిపోయిన వారికి సంబంధించిన పింఛన్లు నిలపడం మినహా ఎవరివీ తొలగించలేదు. – ఓబుళమ్మ, డీఆర్‌డీఏ పీడీ

కూటమి నేతలతో ఇబ్బందులు..

ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియలో కూటమి నేతలు సచివాలయ సిబ్బందికి పెద్ద తలనొప్పిగా మారారు. పింఛన్ల పంపిణీ సమయంలో టీడీపీ వాళ్లకు మాత్రం పంపిణీ చేయండంటూ హుకుం జారీ చేయడంతో సచివాలయ సిబ్బంది తలలు పట్టుకున్నారు.

ఇంటి వద్దకే పింఛన్ తూచ్..

రాప్తాడురూరల్/పామిడి: ఇళ్ల వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మాటలు క్షేత్రస్థాయిలో నీటిమూటలవుతున్నాయి. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలో రావి నారాయణరెడ్డి (ఆర్‌ఎన్‌ఆర్) కాలనీలో నాగులకట్ట వద్ద, మరో ఇంటివద్ద చెట్ల కింద నిలబడి పింఛన్ సొమ్ము అందజేశారు. పామిడి పట్టణంలో ఇలాంటి దుస్థితే నెలకొంది. రాచానపల్లిలో గతనెలలో కూడా సచివాలయం, రామాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. సాంకేతిక సమస్య కారణంగా అక్కడక్కడా ఇలా ఇస్తున్నారని అధికారులు చెబుతుండగా.. సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో ఇళ్లకు వెళ్లి ఇవ్వడం తీవ్ర ఇబ్బందిగా మారుతోందని ఉద్యోగులు చెబుతున్నారు.

పల్లెకు పోదాం.. పండుగ చేద్దాం



సొంతూరికి వెళ్తున్న యువతి



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న అనంతపురం ఆర్టీసీ బస్టాండ్



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

దసరా పండుగ చేసుకునేందుకు అంతా పల్లెబాట పట్టారు. విద్యాసంస్థలకు ఈ నెల 3 నుంచి పండుగ సెలవులు ప్రకటించినా, గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 2న కూడా సెలవు రావడంతో విద్యార్థులు సొంతూర్లకు బయలుదేరారు. ప్రయాణికులతో అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ మంగళవారం కిటకిటలాడింది. బస్సులు ఎక్కేందుకు విద్యార్థులు, ప్రయాణికులు పోటీ పడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

పింఛన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారీ



విడపనకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి బాషా

విడపనకల్లు: పింఛన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఘటనపై పోలీసులకు పంచాయతీ కార్యదర్శి బాషా ఫిర్యాదు చేశారు. వివరాలు.. విడపనకల్లులోని సచివాలయ-2లో సర్వేయర్‌గా పని చేస్తున్న ఇనాయతుల్లాకు 4, 5 క్లస్టర్‌లో ఉన్న 57 మందికి పింఛన్ సొమ్ము అందించే బాధ్యతను అప్పగించారు. ఈ క్రమంలో ఆయా క్లస్టర్ల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు సంబంధించి రూ.2.52 లక్షలను సెప్టెంబర్ 30న ఇనాయతుల్లా అందుకున్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు మంగళవారం ఉదయమే ఆయన పంపిణీ చేయాల్సి ఉండగా... 12 గంటలైనా ఆయన ఎక్కడున్నది తెలియలేదు. చివరకు లబ్ధిదారులు సచివాలయం వద్దకు చేరుకోవడంతో వెంటనే ఇనాయతుల్లాకు అధికారులు ఫోన్ చేశారు. అందుబాటులోకి రాకపోవడంతో కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఆరా తీశారు. వారు కూడా స్పష్టంగా తెలపకపోవడంతో పింఛన్ సొమ్ముతో సర్వేయర్ ఇనాయతుల్లా పరారైనట్లు నిర్ధారించుకుని పంచాయతీ కార్యదర్శి బాషా చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కరేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇతరుల నుంచి డబ్బు సమకూర్చుకుని లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేసినట్లు అధికారులు తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించండి : డీఏఓ



మట్టి పరీక్ష ఫలితాల పత్రాలను అందిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

పుట్లూరు: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టి లాభాలు గడించాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. పుట్లూరు మండలం చెర్లోపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఏఓ మాట్లాడుతూ.. రబీలో సాగు చేసే పప్పుశనగ తదితర పంటలకు రైతులే స్వయంగా బీమా చేయించుకోవాలన్నారు. సాగు చేసిన మొక్కజొన్నను పరిశీలించి అందులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం గ్రామంలో భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు ఫలితాల పత్రాలు, కౌలు రైతు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఫక్రుబీ, కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి, డీఆర్‌సీ ఏడీఏ శైలజాకుమారి, ఏడీఏ చెంగలరాయుడు, ఏఓ కాత్యాయిని, ఏఈఓలు, వీహెచ్ఏ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పంటలన్నీ పాయే!

- సకాలంలో కురవని వర్షాల వల్ల దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- 319.6 మి.మీ గానూ 431.3 మి.మీ వర్షపాతం
- 33 రెయినీడేస్... 80 వరకు డ్రైస్పెల్స్ నమోదు



అక్కంపల్లి వద్ద పంట కోత ప్రయోగంలో ఎకరాకు ఒక క్వింటా దిగుబడి కూడా లేదంటున్న అధికారులు



ఆత్మకూరులో చెట్టుకు కనిపిస్తున్న ఒకట్రెండు వేరుశనగ కాయలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో వర్షం ఎక్కువగానే కురిసినా... పంట మాత్రం చేతికి దక్కకుండా పోయింది. ఇది మంగళవారంతో ముగిసిన ఈ ఖరీఫ్ పరిస్థితి. సకాలంలో కాకుండా అవసరం లేని సమయంలో వర్షాలు పడడంతో సాగు విస్తీర్ణం, పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఏటా జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఉన్న పంట కాలాన్ని ఖరీఫ్‌గా పరిగణిస్తారు. జిల్లాకు సంబంధించి రైతులకు ఈ ఖరీఫ్ ఎంతో కీలకమైన సీజన్. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.6 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఈ సారి 34.9 శాతం అధికంగా 431.3 మి.మీ నమోదైనా... రైతులకు పెద్దగా ఫలితం లేకుండా పోయింది.

దెబ్బతీసిన సెప్టెంబర్

పంటల పరిస్థితి బాగానే ఉందని భావిస్తున్న తరుణంలో సెప్టెంబర్ వర్షాలు రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా 55.6 శాతం తక్కువగా 49.3 మి.మీ మాత్రమే నమోదైంది. మొత్తమ్మీద ఈ ఖరీఫ్‌లో సాధారణం కన్నా 34.9 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. నాలుగు నెలల కాలంలో 33 రెయినీడేస్ (వర్షపు రోజులు) నమోదు ఓ రికార్డు కాగా... జూన్ 14 నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో 31 మండలాల పరిధిలో ఏకంగా 80 వరకు డ్రైస్పెల్స్ (21 రోజులు సరైన వర్షాలు లేకపోతే దానిని ఒక డ్రైస్పెల్ గా గుర్తిస్తారు) నమోదు కావడం విశేషం. ఇందులోనూ నాలుగైదు మండలాల్లో 40 నుంచి 50 రోజుల పాటు సుదీర్ఘ వర్షపాత విరామాలు నమోదయ్యాయి. పంట వేసిన జూలై నెలలో, పంటలన్నీ కీలకదశలో ఉన్న సెప్టెంబర్‌లో వర్షాలు మొహం చాటేయడంతో దిగుబడులపై ప్రభావం పడింది. చాలా ప్రాంతాల్లో వేరుశనగ ఎకరాకు కనీసం 2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. ఇదే విషయాన్ని పంట కోత ప్రయోగాలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే ఆముదం ఒక విడత కోత రావచ్చని, పత్తి కూడా అంతంత మాత్రమేనని వ్యవసాయాధికారులు అంటున్నారు. ప్రస్తుతం కంది దిగుబడులపై రైతులు ఆశలు పెంచుకున్నా పూత రాలడం, వెర్రితెగులు ఆశించడంతో ఇది కూడా అంతంత మాత్రమేనని చెబుతున్నారు. మొత్తానికి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ పంటలన్నీ బాగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

ముందే పలకరించిన నైరుతి

గతానికి భిన్నంగా నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది జూన్ 2వ తేదీనే జిల్లాను పలకరించాయి. గతంలో సాధారణంగా జూన్ మొదటి వారం తర్వాత కానీ పలకరించిన దాఖలాలు లేవు. రుతుపవనాలు జిల్లాను తాకగానే వర్షాలు కూడా మొదలయ్యాయి. జూన్ 14 వరకు జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. జూన్ నెలంతా కలిపి సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా, కేవలం 15 రోజుల్లోనే ఏకంగా 143 మి.మీ వర్ష పాతం నమోదు కావడం గమనార్హం. అయితే జూన్ 14న ఆగిపోయిన వర్షాలు నెలన్నర రోజుల పాటు పత్తాలేకుండా పోయాయి. జూన్ 15న ఖరీఫ్ ఏరువాక మొదలు కాగా, జూలై నెలాఖరు వరకూ ప్రధాన పంటల సాగుకు అనుకూలమైన కీలక సమయంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూలైలో సాధారణ వర్షపాతం 63.9 మి.మీటర్లకు గానూ 61.8 శాతం తక్కువగా కేవలం 24.4 మి.మీ నమోదైంది. అప్పటికే అరకొర తేమలో అతి కష్టమ్మీద సాగు చేసిన పంటలు బాగా దెబ్బతిన్నాయి. అయితే ఆగస్టు మొదటి వారం, ఆ తర్వాత మూడోవారం మంచి వర్షాలు రావడంతో దెబ్బతిన్న పంటలు కొంత వరకు కోలుకుని ఆశలు రేకెత్తించాయి. ఆగస్టులో 83.8 మి.మీ గానూ 151.6 శాతం అధికంగా 210.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

90 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ పంపిణీ చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

అనంతపురం అర్బన్: ప్రస్తుత రబీలో 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తన పప్పుశనగ పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. 2023లో తీవ్ర వర్షాభావం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అయితే ఇప్పటి వరకూ ప్రభుత్వం బీమా ప్రకటించలేదన్నారు. కనీసం పెట్టుబడి సాయం రూ.20 వేలు కూడా ఇవ్వలేదన్నారు. దీంతో రబీలో పంట సాగుకు రైతులు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ప్రకటించినట్లుగా 25 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ పంపిణీపై చేపడితే రైతులకు ప్రయోజనం ఉండదన్నారు. పప్పుశనగ బయటి మార్కెట్‌లో క్వింటా రూ.7 వేల నుంచి రూ.7,300 వరకు ధర ఉందన్నారు. అయితే ప్రభుత్వం రూ.9,400 ధర నిర్ణయించి 25 శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పడం ఒక విధంగా రైతులను మోసగించడమేనని అన్నారు. రైతుల దుస్థితిని గమనించి 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ ఇవ్వాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో ఎరువులు, పురుగుమందులు ఇవ్వాలన్నారు.

మున్సిపల్ కార్మికుడి అనుమానాస్పద మృతి



కొల్లారి (ఫైల్)

రాయదుర్గం టౌన్: స్థానిక మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుడు కొల్లారి (43) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కొల్లారి... పాత మున్సిపల్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం నుంచి ఆయన కనిపించకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రాయదుర్గంలోని గౌడ నూతన హౌసింగ్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఓ కట్టడంలో మంగళవారం మధ్యాహ్నం కొల్లారి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు, అధికారులు సైతం అక్కడకు చేరుకుని కొల్లారి మృతదేహాన్ని పరిశీలించారు. కాగా, కొల్లారి మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కొల్లారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గతంలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఓ వైపు మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తూనే అనేక షార్ట్ ఫిల్మ్‌లను ఆయన తీసేవాడు.

ఏపీజీబీ ద్వారా విరివిగా రుణాలు

- ఏపీజీబీ రీటైల్ పండుగ రుణమేళాలో ఆర్ఎం శ్రీదేవి



రుణమేళాను ప్రారంభిస్తున్న ఆర్ఎం శ్రీదేవి, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభ్యున్నతికి, అన్ని రంగాల పురోగతికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా విరివిగా రుణాలు ఇస్తున్నట్లు ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంకు రీటైల్ పండుగ రుణమేళా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఈ నెల 1 నుంచి డిసెంబర్ 31 వరకు కొత్తగా 333 రోజుల ప్రగతి త్రివేణి డిపాజిట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ డిపాజిట్లపై 7.45 శాతం నుంచి 8.25 శాతం వడ్డీరేట్లు వర్తిస్తాయన్నారు. మరో వైపు 444 రోజుల ప్రగతి కుబేర్ డిపాజిట్ పథకం కూడా అమలులో ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా వరుస పండుగల శుభవేళ ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడం, గృహ, వాహన, తనఖా రుణాలకు ప్రత్యేకమైన వడ్డీ రాయితీతో పాటు ప్రాసెసింగ్ ఛార్జీల మినహాయింపు ఉంటుందన్నారు. అలాగే విద్య, కుటీర పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) స్థాపనకు, 3 కిలోవ్యాట్‌ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు అతి తక్కువ వడ్డీరేట్లకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. సోలార్‌రూఫ్‌టాప్‌కు రూ.78 వేల వరకు రాయితీ ఉంటుందన్నారు. నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) కింద పిల్లల ఆర్థిక భవిష్యత్తు సుస్థిరత కోసం, దీర్ఘకాలంలో సంపద సృష్టించాలనుకునే తల్లిదండ్రుల కోసం నవజాత శిశువుల మొదలు 18 సంవత్సరాలలోపు వయసున్న పిల్లల కోసం ఎన్‌పీఎస్ వాత్సల్య కింద ఖాతా తెరవవచ్చన్నారు. సంవత్సరానికి రూ.1000 చెల్లిస్తే చివర్లో ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఎక్కడికక్కడ బ్యాంకు శాఖల్లో సంప్రదించి ఏపీజీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రీటైల్ పండుగ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్లు శ్రీధర్, శివకుమార్, అబ్దుల్ మునాఫ్, చైతన్యకుమార్, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అంటూ ప్రజలపై భారం

- 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా
- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం అర్బన్: కూటమి సర్కార్ అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ విధానంతో ప్రజలపై మరింత భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక పాలసీపై ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు ఆచరణలో జరుగుతున్న దానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. అధికారం చేపట్టిన ఈ వంద రోజుల్లో మూడుసార్లు ఇసుక పాలసీపై స్వయంగా సీఎం చంద్రబాబు సమీక్షించినా... పరిస్థితి ఇసుక రేణువంత కూడా మెరుగు పడలేదన్నారు. అంతేకాక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, పైగా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేని విధంగా ఇసుక ధరను పెంచేశారని మండిపడ్డారు. ఇసుక ధర పెరగడంతో భవన నిర్మాణాలు ఆగిపోయి, ఆ రంగంపై ఆధారపడిన కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారన్నారు. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలంటూ ఈ నెల 4న మండల కార్యాలయాల వద్ద సీపీఎం తలపెట్టిన ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప పాల్గొన్నారు.

టమాట కిలో రూ.60



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కక్కలపల్లి మండీలో మంగళవారం టమాట కిలో రూ.60తో అమ్ముడుపోయింది. జూలై, ఆగస్టుతో పోల్చుకుంటే సెప్టెంబర్‌లో పంట కోతలు తగ్గిపోయాయి. అక్టోబర్‌లో కూడా అంతంత మాత్రంగానే ఉండవచ్చని చెబుతున్నారు. దీంతో కక్కలపల్లి మండీకి ఇటీవల కాలంలో టమాటా తక్కువగా వస్తోంది. సరుకు తగ్గడంతో ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. గత 15 రోజులుగా కిలో టమాట రూ.30 నుంచి రూ.45 వరకు పలికింది. మంగళవారం మరోసారి ధర అమాంతంగా పెరిగి రూ.60కి చేరుకుంది. మంగళవారం మార్కెట్‌లో 900 టన్నుల క్రయ విక్రయాలు జరిగాయి. ఇందులో నాణ్యమైన టమాట 15 కిలోల బాక్సు గరిష్టంగా రూ.900 పలికింది. అలాగే కనిష్ట ధర రూ.30, సరాసరి ధర రూ.45తో అమ్ముడుపోయాయి. ఈ నెలంతా మంచి ధరలు ఉండవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 15 కిలోల బాక్సు నాణ్యమైన టమాట రూ.1000 దాటవచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రతి 10 వేల మందికి ఒక మద్యం షాపు

- అనంతపురంలోనే 41 ప్రైవేట్ దుకాణాలు
- జిల్లాలో ఏర్పాటు కానున్న ప్రైవేటు మద్యం షాపులు 136
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ శాఖ అధికారులు



వివరాలను వెల్లడిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం: నూతన ఎక్సైజ్ విధానం ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 136 ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఒక్క అనంతపురం నగరంలోనే 41 ప్రైవేట్ మద్యం షాపులు కేటాయించారు. ప్రతి పది వేల మంది జనాభాకు ఒక మద్యం షాపు అందుబాటులోకి రానుంది. నగరంలో ఈ మేరకు వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డి వెల్లడించారు. వారు తెలిపిన మేరకు.. అక్టోబర్ 9 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. షాపుల లైసెన్స్ లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. రూ.2 లక్షల (వెనక్కి ఇచ్చే అవకాశం లేదు) రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. హైబ్రిడ్ విధానంలో దరఖాస్తు చేయాలనుకుంటే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పేమెంట్‌ను ఈ-చలానా నంబర్‌ను జనరేట్ చేసుకుని స్టేట్ బ్యాంక్ సంబంధిత బ్రాంచులో ఫీజు చెల్లించాలి. ఆఫ్‌లైన్ పద్ధతిలో అయితే డిమాండ్ డ్రాఫ్టని డ్రా చేసి జిల్లాలోని ఏ ఎక్సైజ్ స్టేషన్‌లో నైనా సమర్పించవచ్చు. డీడీని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బ్యాంక్‌లలో మాత్రమే డ్రా చేయాల్సి ఉంటుంది. ఏ జిల్లాలో అయితే మద్యం షాపులకు దరఖాస్తు చేశారో ఆ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పేరు మీద డిమాండ్ డ్రాఫ్టను డ్రా చేయాల్సి ఉంటుంది. దీంతో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఎంట్రీ పాస్ దరఖాస్తుదారుడికి లభిస్తాయి. వీటి ద్వారా దరఖాస్తుదారుడు లక్కీ డ్రాకి ప్రవేశం పొందుతారు. లాటరీ అక్టోబర్ 11న కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 8 గంటలకు నిర్వహిస్తారు. డ్రాలో ఎంపికైన వారు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్సులో 1/6 వంతు చెల్లించి మద్యం షాపులను అక్టోబర్ 12 నుంచి ప్రారంభించుకోవచ్చు.

స్లాబులు ఇలా..

- 10 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.
- 10,001 నుంచి 50 వేల జనాభా వరకు ఉన్న ప్రాంతాల్లో రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.55 లక్షలు, 50,001 నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5,00,001 నుంచి ఆ పైన జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాల కాల వ్యవధితో మద్యం షాపు కేటాయిస్తారు. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను రెండు సంవత్సరాలకు 12 కంతుల్లో చెల్లించవచ్చు. ప్రతి రెండు నెలలకు ఒక కంతు చెల్లించాలి. రెండో ఏడాది ట్యాక్స్‌ను 10 శాతం పెంచుతారు. అమ్మకాలపై 20 శాతం లాభం ఉంటుంది.

మండలాల వారీగా దుకాణాల ఏర్పాటు ఇలా..

అనంతపురం నగర పరిధిలో 41, ఆత్మకూరు మండలంలో 3, కణేకల్లు-3, రాప్తాడు-1, బుక్కరాయ సముద్రం-4, నార్పల-4, శింగనమల-3, గార్లదిన్నె-4, గుత్తి-5, గుత్తి రూరల్- 2, పామిడి-4, యాడికి-4, పెద్దవడుగూరు-3, గుంతకల్లు మున్సిపాలిటీలో 10, గుంతకల్లు రూరల్- 2, వజ్రకరూరు- 2, తాడిపత్రి మునిసిపాలిటీ-9, తాడిపత్రి రూరల్-3, యల్లనూరు-1, పుట్లూరు-2, పెద్దపప్పూరు-1, ఉరవకొండ-5, విడపనకల్లు-2, కణేకల్లు-4, బొమ్మనహాళ్-2, రాయదుర్గం మునిసిపాలిటీ-5, రాయదుర్గం రూరల్-1, డీ.హీరేహాళ్-1, గుమ్మఘట్ట-1, కళ్యాణదుర్గం మునిసిపాలిటీ-3, కళ్యాణదుర్గం రూరల్-2, బ్రహ్మసముద్రం-1, బెళుగుప్ప-1, కంబదూరు-1, కుందుర్పి-2, శెట్టూరు-1 షాపులు కేటాయించారు.

వివాహిత ఆత్మహత్య

అనంతపురం/రాప్తాడురూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం దండువారిపల్లికి చెందిన ఉజ్జినప్పకు అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి (33)తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె ఉంది. ఎస్కేయూలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ కుటుంబాన్ని ఉజ్జినప్ప పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. మంగళవారం ఉదయం గొడవ పడిన అనంతరం భర్త డ్యూటీకి వెళ్లాడు. కాసేపటి తర్వాత కుమార్తెను స్కూల్‌కు పంపిన శ్రీలక్ష్మి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి చేరుకున్న భర్త పలుమార్లు పిలిచినా వాకిలి తీయకపోవడంతో కిటికీ ద్వారా లోపలకు చూశాడు. అప్పటికే ఉరికి వేలాడుతున్న భార్యను గమనించి, చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి శ్రీలక్ష్మిని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై శ్రీలక్ష్మి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మృతుడి ఆచూకీ లభ్యం



కళ్యాణ్ కుమార్ (ఫైల్)

రాప్తాడు: మండలంలోని గంగలకుంట గ్రామ రైల్వే గేట్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడి ఆచూకీని పోలీసులు పసిగట్టారు. వివరాలను ధర్మవరం రైల్వే సీహెచ్‌ఓ షణ్ముఖానందరెడ్డి మంగళవారం వెల్లడించారు. రాయదుర్గం మండలం కెంచానపల్లికి చెందిన పాండు కుమారుడు కళ్యాణ్‌కుమార్ (19) అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మొదటి, రెండో ఏడాదికి సంబంధించిన సబ్జెక్టులో మిగిలిపోయాయి. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే వారు అవమానంగా భావిస్తారని భావించిన కళ్యాణ్‌కుమార్... రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ధర్మవరంలోని ఆస్పత్రికి చేరుకుని వెళ్లి కుమారుడి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు.

వృద్ధురాలి బలవన్మరణం

విడపనకల్లు: బావిలోకి దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... విడపనకల్లుకు చెందిన బుడుగుల నారాయణమ్మ (73) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. బంధువులు చికిత్స చేయిస్తున్నా ప్రయోజనం లేకపోయింది. మంగళవారం తన పింఛన్ సొమ్ము తీసుకెళ్లి కుటుంబసభ్యులకు ఇచ్చి నేరుగా గ్రామ శివారులోని పురాతన గౌరమ్మ బావి వద్దకు చేరుకుని ఎవరూ లేని సమయంలో దూకింది. గమనించిన రైతులు వెంటనే బావిలోకి దూకి గాలించి వెలికి తీసేలోపు మృతి చెందింది.

వెలుగు చూసిన సమగ్ర అక్రమాలు

- సమగ్రశిక్ష సెక్టోరియల్ పోస్టుల భర్తీలో అర్హత లేకున్నా అస్మదీయులకు చోటు
- గతంలో సరెండర్ అయిన వారు అర్హత జాబితాలో
- అన్ని అర్హతలున్న వారు అనర్హుల జాబితాలో
- ఇంటర్వ్యూలకు 14 మందికి గాను 13 మంది హాజరు
- డీఈఓ అక్రమాలపై ట్రైనీ కలెక్టర్‌తో ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ, ఆర్ఈఎఫ్ నాయకుల వాగ్వాదం



ట్రైనీ కలెక్టర్ వినూత్నతో వాగ్వాదం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీలో డీఈఓ వరలక్ష్మి అంతా తాను అనుకున్నట్టే చేశారు. తనవారిని అందలం ఎక్కించే క్రమంలో సమగ్రశిక్షలో పని చేస్తూ వివిధ కారణాలతో సరెండర్ అయిన టీచర్లను అర్హుల జాబితాలో చేర్చారు. ఈ జాబితాను పరిశీలించిన పలువురు ఉపాధ్యాయులు, ఆశావహులు ఇదెక్కడి చోద్యం అంటూ నిట్టూర్చారు.

ట్రైనీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు

సెక్టోరియల్ అధికారుల పోస్టుల అర్హత జాబితాలో ఉన్న 14 మందికి గాను హాజరైన 13 మంది టీచర్లకు మంగళవారం సాయంత్రం ట్రైనీ కలెక్టర్ వినూత్న సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్‌తో పాటు డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీ రవిసాగర్ పాల్గొన్నారు. వీరిలో గతంలో సమగ్ర శిక్షలో పని చేస్తూ వివాదాస్పద పనితీరుతో రీప్యాట్రియేషన్‌కు గురైన ఇద్దరు ఉన్నారు. అలాగే ఓ టీచరు పీజీ సర్టిఫికెట్‌ను ఆలస్యంగా జత చేశాడనే కారణంతో అతడిని అనర్హుల జాబితాలో పెట్టారు. వాస్తవానికి డీఈఓ వరలక్ష్మి దరఖాస్తులు పరిశీలన చేసేనాటికి సదరు టీచరు పీజీ సర్టిఫికెట్‌ను జత చేశారు. అయినా పరిగణనలోకి తీసుకోకుండా అనర్హుడి కింద చేర్చారు. అంతేకాక ఇంటర్వ్యూలు పూర్తయినా ఎవరెవరు హాజరయ్యారనే విషయాన్ని గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. మొన్నటి వరకూ ప్రతిదీ కలెక్టర్ పై చెప్పిన విద్యాశాఖ అధికారులు... ఇంటర్వ్యూ సమాచారం అడిగితే ట్రైనీ కలెక్టర్ వినూత్న పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడం గమనార్హం.

డీఈఓ అక్రమాలపై మండిపాటు

ఇంటర్వ్యూల విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్ఈఎఫ్ నాయకులు సమగ్ర శిక్ష కార్యాలయానికి చేరుకుని డీఈఓ తీరును తప్పుబట్టారు. సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీ విషయంలో కలెక్టర్‌ను డీఈఓ మరోమారు బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారంటూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు యల్లన్న, మీనుగ రామాంజనేయులు, ఆర్ఈఎఫ్ నాయకులు హెచ్.రామచంద్ర, ఎండీ నాగభూషణం తదితరులు మండిపడ్డారు. ఇంటర్వ్యూలు జరుగుతున్న చాంబర్‌లోకి దూసుకెళ్లి ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. పోస్టుల భర్తీలో డీఈఓ పక్షపాత ధోరణిని ఎండగట్టారు. గతంలో సమగ్ర శిక్షలో పనిచేసి క్రమశిక్షణ చర్యలు కింద రీప్యాట్రేషన్ అయిన వారు, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, అర్హత వయస్సు మించిన వారు ఉన్నారని మండిపడ్డారు. అలాంటి వారిని ఏ ఉద్దేశంతో ఎంపిక చేశారో చెప్పాలని నిలదీశారు. ఈ ప్రక్రియను రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ట్రైనీ కలెక్టర్... విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని భరోసానిచ్చారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థినులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత, పీఈటీ కొండమ్మ మంగళవారం తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17,అండర్–19లో బాక్స్ లంగడి(కుంటీ ఆట)లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరు ఈనెల 7 నుంచి చండీఘర్‌లో జరిగే జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా హెచ్‌ఎం, పీఈటీ విద్యార్థినులను అభినందించారు.

తరిమెల అమరనాథరెడ్డికి అత్యున్నత గౌరవం



డాక్టర్ అరుణ్‌గోయల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అమరనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ రచయిత, మానవతా రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమరనాథరెడ్డి జాతీయస్థాయి గౌరవాన్ని అందుకున్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ రాజస్థాన్‌లోని జైపూరులో మంగళవారం ఆరోగ్యకర సమాజానికి తోడ్పాటు నందిస్తున్న విశిష్ట వ్యక్తులను సత్కరించింది. అందులో భాగంగా ఏపీ తరఫున అమరనాథరెడ్డికి కేంద్ర ఆరోగ్య శాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ అతుల్ గోయల్ ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందించారు. మానవతా రక్తదాతల సంస్థ కో కన్వీనర్ సలీం మాలిక్ పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ముందస్తు దసరా సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న ఏజీఎం, ప్రిన్సిపాల్, చిన్నారులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కోర్టు రోడ్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం ముందస్తు 'దసరా సంబరాలు' ఘనంగా జరుపుకొన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి అమ్మవారి చిత్రపటానికి కొబ్బరికాయ కొట్టి పూజ ప్రారంభించారు. విద్యార్థులకు దసరా పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఏఓ గోపాల్, అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు భారతి, మంజుల పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

ఆత్మకూరు: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని సర్పంచ్ వరలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషతఉన్నత పాఠశాల వద్ద చెత్తచెదారం తొలగించి మొక్కలు నాటారు. ఈసందర్భంగా సర్పంచు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలనన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం విరివిగా మొక్కలు పెంచాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి జేఎన్‌టీయూ అనంతపురం ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య మంగళవారం యూనిఫాంను పంపిణీ చేశారు. ఐసీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తాం



ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, సిబ్బంది

అనంతపురం సిటీ: వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తామని బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. బీఎస్ఎన్ఎల్(భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) ఆవిర్భవించి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీజీఎం బాలగంగాధరరెడ్డి, ఇతర విభాగాల అధికారులు, ప్రొవైడర్లు పాల్గొన్నారు.

తమ్ముళ్ల కర్ర పెత్తనం



- సనప ఆర్‌ఎస్‌కే సిబ్బందిని కర్రతో బెదిరించిన టీడీపీ నేత
- చెప్పినట్లు వినకపోతే సస్పెండ్ చేయిస్తామని హూంకరింపు
- 112కు ఫిర్యాదు చేసిన వ్యవసాయ సిబ్బంది

మూడు వారాల క్రితం ఆత్మకూరు రైతు సేవా కేంద్రంలోకి సిద్దరాంపురం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు వచ్చాడు. 'నేను చెప్పిన వారికే ఈ క్రాప్ బుకింగ్ చెయ్యాలి. అలా కాదని వైఎస్సార్‌సీపీకి చెందిన వారి పొలాలకు ఈ క్రాప్ చేస్తే సహించేది లేదు. మేం ఏం చెబితే అదే మీరు చెయ్యాలి. అలా అయితేనే ఇక్కడ ఉండండి. లేదంటే వెళ్లిపోండి' అంటూ వ్యవసాయ అధికారులు, సిబ్బందిపై విరుచుకుపడ్డాడు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలో అధికారులపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు బిళ్ల పెట్టుకొని వెళ్తే అధికారులు కుర్చీవేసి టీ ఇచ్చి మరీ మీ పనులు చేసి పెడతారని చెప్పడంతో తెలుగు తమ్ముళ్లు అదే అదునుగా భావించి ప్రభుత్వ కార్యాలయాల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఎలాంటి పనులు లేకున్నా ఐదు నుంచి పది మంది కూటమి ప్రభుత్వానికి చెందిన వ్యక్తులు కార్యాలయాల్లో తిష్ట వేస్తున్నారు. దీంతో పనుల కోసం వెళ్లిన ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా చాలా కార్యాలయాలు, సచివాయాల్లో మహిళా అధికారులు ఉండంతో ఎలాంటి పనులు లేకపోయినా టీడీపీ నాయకులు కార్యాలయాల్లో కూర్చొని ఉండటంతో ఆ అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సనప రైతు సేవా కేంద్రంలోకి కర్ర తీసుకెళ్లి బెదిరిస్తూ..

ఆత్మకూరు మండలంలోని సనప గ్రామానికి చెందిన రామాంజినేయులు అనే వ్యక్తి తన పొలంలో టమాట సాగు చేశాడు. వ్యవసాయ సిబ్బంది కూడా తాను దరఖాస్తులో కనబరచిన విధంగానే టమాటకు ఈ క్రాప్ బుకింగ్ చేశారు. కాని ప్రస్తుతం ఆ వ్యక్తి తనకు టమాట అవసరం లేదని తన పొలంలో వేరుశనగ పంట సాగు చేసినట్లు రాయాలని వ్యవసాయ సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడు. తన మాట వినలేదని మూడు రోజుల పాటు ఫోన్ చేసి వ్యవసాయ అధికారులను ఇబ్బందులకు గురి చేశాడు. ఆ తర్వాత సనపలోని రైతు సేవా కేంద్రంలోకి ఓ కర్ర తీసుకెళ్లి తాను చెప్పినట్లు తన పొలంలో వేరుశనగ రాయాలని ఎన్ని రోజుల నుంచి చెబుతున్నా పట్టించుకోరా ? అంటూ ఆ అధికారులపై జులుం ప్రదర్శించాడు. దీంతో వ్యవసాయ సిబ్బంది తన ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వగా వారికి కూడా ఫోన్లు చేసి సతాయించాడు. తాను చెప్పినట్లు వినకపోతే వ్యవసాయ సిబ్బంది అందరూ ఉలవలు అమ్ముకున్నారని, ఈ క్రాప్ బుకింగ్ చేసేందుకు రైతుల దగ్గర నుంచి డబ్బు వసూలు చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బెదిరించాడు.

తాజాగా..

మంగళవారం కూడా ఓ వ్యవసాయ అధికారికి ఫోన్ చేసి మీరు ఎక్కడ ఉన్నారు. మీ లోకేషన్ పెట్టండి, ఏం బిల్లిబిత్తిరి వేషాలు వేస్తావా, నువ్వు ఎవరెవరితోనే ఫోన్లు చేయిస్తావా? నీ సస్పెన్షన్ ఆర్డర్ నీ చేతిలో పెట్టేవరకు నేను ఊరుకోను అంటూ సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో సదరు అధికారి భయపడి డయల్ 112కు ఫిర్యాదు చేశారు. ఇలా అయితే తాము ఎలా ఉద్యోగాలు చెయ్యాలి అంటూ ఆ వ్యవసాయ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

రక్తదాతలకు సన్మానం



రక్తదాతలను సన్మానిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రాణాపాయంలో ఉన్న వారికి పదుల సార్లు రక్తదానం చేసిన నగరపాలక సంస్థ సిబ్బందిని నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం మేయర్ వసీం, కమిషనర్ నాగరాజు సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ సిబ్బంది సద్దానప్ప 66 సార్లు, శివన్న 38 సార్లు, నాగేశ్వర్‌రెడ్డి 25 సార్లు, లోకేష్‌నాయుడు 22 సార్లు, రవిశంకర్ రెడ్డి20 సార్లు, కుళ్లాయిరెడ్డి 15 సార్లు రక్తదానం చేశారన్నారు. అపోహల కారణంగా చాలా మంది రక్తదానం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, బాలాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నేత కుళ్లాయస్వామి, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ పి.ప్రసూన

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన పిలుపునిచ్చారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించుకుందామని కోరారు. ప్రపంచం మొత్తం సైన్స్ చుట్టే తిరుగుతోందన్నారు. 36 స్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. జేవీవీ నాయకులు ఎస్.గాంగేనాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో చెకుముకి కన్వీనర్ రామకృష్ణ, కేఎస్ఆర్ స్కూల్ హెచ్‌ఎం నారాయణ, అధ్యాపకులు ఎం. అరుణకుమారి, అంజాద్ వలి, జేవీవీ నగర అధ్యక్షులు రామిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపాలు, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, తిప్పేస్వామి, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

రాప్తాడు: సైన్సుకు ప్రయోగమే ప్రాణమని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు సాకే భాస్కర్ అన్నారు. మంగళవారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో మండల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ నుంచి గృహిత, వెంకట సాయి, వంశీ, సెయింట్ విన్సెంట్ డీపాల్ పాఠశాల నుంచి హిదయతుల్లా, శ్రీరూప (9వ తరగతి), మనస్విణి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు పార్థసారథి, నారాయణ, శివానంద, భరత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ...ముగ్గురికి తీవ్ర గాయాలు

రాప్తాడురూరల్: రెండు బైకులు ఢీ కొని ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు తారా మసీదు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు...పాపంపేటకు చెందిన ముస్లిం యువకుడు తన స్కూటీపై వేకువజామున మసీదుకు బయలుదేరాడు. రాజా హోటల్ సమీపంలో మరో యువకుడు లిఫ్ట్ అడిగడంతో అతడిని ఎక్కించుకున్నాడు. కాస్తా ముందుకు వెళ్లగా యూనియన్ బ్యాంకు దాటిన తర్వాత ఎదురుగా రాంగ్‌రూట్‌లో ఓ యువకుడు బుల్లెట్‌పై వచ్చాడు. ముందు వెళ్తున్న ఆటోను తప్పించే ఎదురెదురుగా వస్తున్న స్కూటీ, బుల్లెట్ బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత వీరి వెనుక వస్తున్న మరో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఆటో డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను సర్వజన ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎం గాయాలు

అనంతపురం: నగరంలోని జాతీయ రహదారి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎంకు గాయాలయ్యాయి. అనంతపురం ట్రాఫిక్ ఎస్ఐ ఆనంద్ తెలిపిన మేరకు.. మర్తాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగరాజు బైక్‌పై అనంతపురం నుంచి వెళ్తుండగా, తమిళనాడుకు చెందిన లారీ ఢీకొనడంతో కాలికి తీవ్రంగా గాయమైంది. స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

శింగనమల సబ్ పోస్ట్ మాస్టర్‌గా పవన్‌కుమార్‌రెడ్డి

అనంతపురం సిటీ: శింగనమల సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పవన్‌కుమార్‌రెడ్డి ఎట్టకేలకు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. శింగనమలలో ఇప్పటి వరకు పోస్ట్‌మాస్టర్‌గా పని చేసిన వెంకటేశ్వర్లు గతనెల 30న ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఉద్యోగ విరమణకు ఐదు నెలలకు ముందే అనంతపురంలోని డివిజనల్ కార్యాలయంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డిని శింగనమలకు బదిలీ చేస్తూ కర్నూలు పీఎంజీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే అతను అనంతపురంలోనే ఉండాలని భావించి శింగనమలకు వెళ్లకుండా బదిలీ ఉత్తర్వులు రద్దు చేయించుకునేందుకు పావులు కదిపారు. సోమవారం రాత్రి బాగా పొద్దుపోయే వరకూ తన ప్రయత్నాలు కొనసాగించారు. ఈ విషయం బయటకు పొక్కడం, పోస్టల్ ఏఎస్పీని రాత్రికి రాత్రే 'సాక్షి' వివరణ కోరింది. భయపడిన అధికారులు తమ ఆలోచనలను విరమించుకొని రిటైర్డ్ అయిన వెంకటేశ్వర్లు నుంచి బాధ్యతలు చేపట్టినట్లు ఆయన ఇంటికి రాత్రే వెళ్లి సంతకాలు తీసుకున్నారు.

ఏబీవీపీ నేతలపై కేసు కొట్టివేత



హర్షం వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: జీసస్‌నగర్‌లో ఉన్న భాష్యం స్కూల్‌పై గతేడాది అక్టోబర్ 2న ఏబీవీపీ నాయకులు దాడి చేసిన ఘటనలో కేసు కొట్టివేస్తూ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి ప్రతిభ తీర్పు వెలువరించారు. గాంధీ జయంతి రోజున పాఠశాల నిర్వహించడంతో ఏబీవీపీ నాయకులు ప్రశ్నించి, చొరబడి పాఠశాలలోకి వెళ్లి ఫర్నీచర్ ధ్వంసం చేశారనే అభియోగంతో కేసు నమోదు చేశారు. సరైన ఆధారాలు లేవనే కారణంతో యచంద్ర, అఖిల్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, భరత్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, దిలీప్, నానిపై ఉన్న కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక గుల్జార్‌పేట్‌లోని వాసవీభవన్‌లో ఆపద్బాంధవుల సహాయ సేవా సంఘం, సాయిట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం జరిగింది. కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందించిన చీరలు, నిత్యావసర వస్తువులను వృద్ధాశ్రమాలకు వితరణ చేశారు. వృద్ధుల దినోత్సవ నిర్వాహకులు ఎస్.నాగభూషణం, విజయ్‌సాయి తమ సంస్థల ద్వారా చేస్తున్న సేవలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య సంఘం నేతలు గోపా మచ్చానరసింహులు, గొంది కొండయ్య కొనియాడారు. అనంతరం వివిధ వృద్ధాశ్రమాల్లో పని చేస్తున్న వారిని ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన వృద్ధులకు భోజన వసతి కల్పించారు.

మహాత్మా..నిను మరువం

- అనంతలో గాంధీజీ అడుగుజాడలు
- జిల్లా అంతటా చెరిగిపోని స్మృతులు

సందర్భం | నేడు గాంధీజీ జయంతి



అనంతపురం కల్చరల్: భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి దేశాన్ని ఏకం చేసిన మహనీయుడు గాంధీ మహాత్ముడు. ఆయన మధుర స్మృతులు ప్రతి ప్రాంతంలో ఉన్నట్టే అనంత'లోనూ చెరిగిపోని చిహ్నాలున్నాయి. బుధవారం గాంధీజీ జయంతి సందర్భంగా అనంతవాసులు గాంధీజీ స్మృతులను గుర్తు చేసుకుంటున్నారు. స్వాతంత్య్రోద్యమ కాలంలో గాంధీజీ ఉమ్మడి అనంత జిల్లాకు చాలా సార్లు వచ్చారు. 1921లో లోకమాన్య తిలక్ నిధి వసూలు కార్యక్రమంలో 1929లో ఖద్దరు నిధి వసూలు కార్యక్రమం, 1933లో హరిజన చైతన్య యాత్ర, 1929 మే 16న మరోసారి అనంత పర్యటనకొచ్చారు. ఆయన అడుగుజాడల్లో నడచిన అనంత వాసులు వీధులకు పేర్లు పెట్టుకున్నారు. అందమైన విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు.

అనంతలో గాంధీజీ రాట్నం

గాంధీని స్ఫూర్తిగా తీసుకున్న అనంత నేతలు తాము సైతం అంటూ స్వాతంత్య్ర సమరంలో నడిచారు. కల్లూరు సుబ్బారావు, యర్రమల కొండప్ప, పప్పూరు రామాచార్యులు, నీలం సంజీవరెడ్డి, కలచవేడు వెంకటరమణాచార్యులు, తరిమెల సుబ్బారెడ్డి, చిన్నారపురెడ్డి వంటి వారు గాంధీజీ వెంట నడిచారు. స్వాతంత్య్ర సమరయోధుడు పెద్దగొంది కొండప్ప నిరుపమాన దేశభక్తికి మెచ్చిన గాంధీజీ ఆయన స్వహస్తాలతో అందించిన నూలు వడికే రాట్నం నేటికీ ఆయన మనవడుచ సీనియర్ అడ్వొకేట్ పీజీ విఠల్ ఇంట్లో భద్రంగా ఉంది. ప్రత్యేక సందర్భాల్లో ఆయన దీనిని ఈతరం వారికి పరిచయం చేస్తుంటారు.

నగరంలో గాంధీజీ ప్రతిబింబాలు

నాటి చరిత్రను ప్రతిబింబిస్తూ పాతూరులోని మార్కెట్ వద్ద గాంధీజీ పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ప్రస్తుతం హమాలీ అసోసియేషన్ వారు సంరక్షించుకుంటున్నారు. అదేవిధంగా తాడిపత్రి బస్టాండు, మునిసిపల్ ఆఫీసు కార్యాలయంలో గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. నగరంలో 1930లోనే పాతూరులోని ఓ భాగానికి 'గాంధీ బజార్' పేరు పెట్టి ఆయన పట్ల గౌరవం ప్రకటించుకున్నారు. మద్రాసు ముఖ్యమంత్రిగా ఉండే ఒమ్మందూరు రామస్వామి పాతూరు గాంధీజీ విగ్రహాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కొత్తూరు ఆర్యవైశ్య సంఘం గోపా మచ్చా నరసింహుల ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద ఉమ్మడి అసెంబ్లీ ముందున్న గాంధీ విగ్రహాన్ని పోలిన విధంగా భారీ ఎత్తున గాంధీజీ స్మారకం ఏర్పాటు చేశారు. నగరంలోని అన్ని గాంధీజీ స్మారక చిహ్నాల వద్ద ఏటా అక్టోబరు 2 వచ్చిందంటే ఆయన అహింసా సిద్ధాంతాన్ని పాటించేలా శాంతిదినంగా పాటించడం ఆనవాయితీగా మారింది.



గాంధీజీ రాట్నంతో సీనియర్ అడ్వొకేట్ విఠల్

పింఛన్ల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మంగళవారం లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. అర్హులందరికీ పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నగరంలోని 50 డివిజన్ల పరిధిలో 23,067 పింఛన్‌దారులుండగా అందులో 22,605(98 శాతం) మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు కమిషనర్ నాగరాజు తెలిపారు.

రాప్తాడు: లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ సాల్మన్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ప్రసన్నాయపల్లిలో పింఛన్ పంపిణీని ప్రారంభించారు. రాప్తాడు, రామినేపల్లి, హంపాపురంలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. మొదటి రోజు మండలా వ్యాప్తంగా 98 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో 'అనంతలక్ష్మి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: ఏపీ స్కూల్‌గేమ్స్‌లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మోడరన్ పెంతలోన్ అండర్–17 కేటగిరి బాలిక విభాగంలో పి. శ్రీ యశస్విని, సి. సృజన, శిరీష, బాలుర విభాగంలో ఈతన్, ప్రణయ్ విజయం సాధించారు. అండర్ –19 బాలికల విభాగంలో కీర్తన, రెడ్డి జ్యోష్న, రిషిత గెలుపొందారు. వీరందరూ శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మెన్ అనంతరాముడు అభినందించారు.

కేంద్రం కార్మిక వ్యతిరేక పాలన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి నాయకులు ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట సమితి సభ్యుడు కుళ్లాయిస్వామి అధ్యక్షతన విద్యార్థి, యువజన సంఘాల నాయకులు చేపట్టిన రిలే దీక్షను సమితి కన్వీనర్ రాజారెడ్డి ప్రారంభించారు. ఆయనతో పాటు సమితి కో–కన్వీనర్లు నాగేంద్రకుమార్, ఏసురత్నం, రాజేష్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరిస్తే వేల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి, కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు, విద్యార్థులు, యువజనులు ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు తిరుపతి లడ్డూ విషయంలో దీక్షలు చేస్తున్నారని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఎందుకు దీక్షలు చేయడం లేదని నిలదీశారు. సమితి సభ్యులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వీరనారప్ప, పరమేష్, నరేష్, వీరేంద్ర, వేమన, ఆనంద్, సంతోష్, హనుమంతు, హరణి, గిరి, కేశవ, చిరంజీవి, కృష్ణుడు, రాహూల్, కృష్ణ, హరి పాల్గొన్నారు.

రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం టవర్‌క్లాక్: వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయిన రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట వేసిన, వేయని రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధికి ప్రాజెక్టు అనంత పేరుతో ఒక ప్రణాళిక తయారు చేశామని, దాన్ని అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ మినహా ఏ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. విజయవాడ వరద బాధితులను వెంటనే ఆదుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. లడ్డూ విషయంలో ఏకంగా సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసేదాకా తెచ్చుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు దాదాగాంధీ, గాజుల వాసు, శర్మాస్ వలీ తదితరులు పాల్గొన్నారు.

జంతు వధశాలలు మూసేయాలి

అనంతపురం కార్పొరేషన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని చికెన్, మటన్, తదితర జంతు వధశాలలను మూసివేయాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి ఆదేశించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. జంతు సంక్షేమ మండలి ఆదేశాల మేరకు షాపులను మూసి వేయాలని, ఎవరైనా షాపులను తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సనప విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆత్మకూరు: సనప జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నాగరాజు తెలియజేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సనప పాఠశాల విద్యార్థులు నందకిశోర్, ప్రతాప్, పవన్‌కుమార్, నవనీత, శైలజ, రజిత, జ్యోష్న, భారతి, సమయంత ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త తొలగిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారన్ని తొలగించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, ఏఓ గిరిజ మనోహర్‌రావు, ఎస్‌ఓ మహమ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మంగళవారం డీఎం నాగభూపాల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబందితో కలసి మొక్కలు నాటారు.

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం పాతూరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. ముందుగా వీధుల్లో ర్యాలీ చేపట్టి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం భారత దేశ క్రీడా యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ అందించిన క్యాప్స్, పెన్, డైరీ, గ్లౌజులను విద్యార్థులకు అందించారు.